




# హార్ చీజ్ కల్తీ!

## బేకరీలు, హోటళ్లలో నాసిరకం ఆహారం

- నామమాత్రంగా అధికారుల తనిఖీలు
- ఫిర్యాదులు అందినా.. పర్యవేక్షణ కరువు
- ఆహార కల్తీ నియంత్రణ అధికారుల నిర్లక్ష్యం
- పట్టించుకోని నగర, పురపాలక సంఘాలు

నిజామాబాద్ కార్పొరేషన్ సమీపంలోని ఓ హోటల్‌లో వినియోగదారులు బిర్యానీ ఆర్డర్ చేయగా.. అందులో నాణ్యత లేమి కనిపించింది. రైథాలో ప్లాస్టిక్ వ్యర్థాలు వచ్చాయి. ఇదేంటని కస్టమర్లు అడిగితే తీసేసి తినాలంటూ ఉల్టా జవాబిచ్చారు నిర్వాహకులు. దీంతో సదరు వ్యక్తులు ఆహార భద్రత, కల్తీ నియంత్రణ అధికారులకు ఫిర్యాదు చేశారు. నెల రోజులవుతున్నా.. పట్టించుకోవడం లేదు.

బస్టాండ్ సమీపంలో ఈ మధ్య వెలిసిన ఓ హోటల్‌లోనూ ఇదే రకమైన ఘటన వెలుగు చూసింది. బిర్యానీలో లైట్ పురుగులు పడడాన్ని వినియోగదారులు గుర్తించారు. తీసేసి అదే గిన్నెలో బిర్యానీని తిరిగి సర్వ్ చేసినట్లు కస్టమర్లు గుర్తించి కౌంటర్ వద్ద ఉన్న వారితో గొడవ పడ్డారు. తినకుండానే వారు బయటికి వెళ్లిపోయారు.

కొత్త ఏడాది వేడకల కోసం ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఒకరు ప్రగతి నగర్‌లోని ఓ బేకరీలో కేక్‌ను ఆర్డర్ చేశాడు. రాత్రి కేక్‌ను కట్ చేసిన ఆనందంలో ఉండగా.. కేక్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు వెలుగు చూశాయి. ఇదేంటని బేకరీ బాధ్యులను సదరు టీచర్ అడిగితే అడ్డదిడ్డ సమాధానం ఇవ్వడమే కాకుండా.. అతడినే బెదిరించడం గమనార్హం.

**పత్తాలేని ఆహార కల్తీ నియంత్రణ అధికారులు..**

గతేడాదిలో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఆహార కల్తీ నియంత్రణ అధికారులు హల్‌చల్ చేశారు. వారానికి ఒకసారి హోటళ్లపై దాడి చేసి నిల్వ చేసిన మాంసం, కల్తీ పదార్థాలు, పాడైన ఆహారాన్ని గుర్తించి, నిర్వాహకులకు జరిమానా విధించారు. మూడు నెలలుగా అధికారుల తనిఖీలు లేకపోవడం గమనార్హం. నిజామాబాద్ నగరపాలక సంస్థ సిబ్బంది తనిఖీ చేపట్టి మమ అనిపించారు. ప్రస్తుతం వారు కూడా పర్యవేక్షించకపోవడం అనే రకాల ఊహాగానాలకు తావిస్తున్నది. హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేయక పోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆయా హోటళ్ల యజమానులను బెదిరించి, తమ చెప్పు చేతల్లోకి తెచ్చుకునేందుకు తూతూ మంత్రంగా దాడులు నిర్వహించి మామూళ్ల మత్తులో ఇప్పుడు జోగుతున్నారని విమర్శిస్తున్నారు. ఆహార తయారీ అన్నది నిరంతర ప్రక్రియ అని.. అధికారులు దాడులు చేయడం ఆపేస్తే కల్తీ నిరంతరం కొనసాగుతున్నదని ప్రజలు అంటున్నారు. ఫుడ్ డెలివరీ యాప్స్ ద్వారా ఇంటికే ఆహారాన్ని తెప్పించుకుంటున్న ఘటనల్లోనూ కల్తీ వెలుగు చూస్తున్నది. ఆఫర్లు ఎరగా చూపి, హోటళ్లలో మిగిలిన బిర్యానీ, చికెన్ ఐటమ్స్‌ను అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సింగిల్ బిర్యానీ ధర మాములుగా రూ.220 వరకూ ఉన్నది. ఆఫర్లలో 50శాతం డిస్కౌంట్ చొప్పున రూ.120 నుంచి రూ.150 వరకే పలు రెస్టారెంట్లు అందిస్తున్నాయి. ఇందులో పాచిన పదార్థాలు కలుపుతున్నారని ప్రచారం జరుగుతున్నది.



నిజామాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్ నగరంతో పాటు కామారెడ్డి, ఆర్మూర్, బోధన్ వంటి పట్టణాల్లో వెలిసిన అనేక రెస్టారెంట్లు, హోటళ్లు, బేకరీల్లో పరిశుభ్రత తీసికట్టుగా మారింది. ఆహారంలో పురుగులు, వ్యర్థాలు వెలుగు చూస్తుండడం సాధారణమైపోయింది. అన్నంలో పురుగులు, చెడిపోయిన కూరలు, నాణ్యతలేని బిర్యానీలు, కంపుకొడుతున్న మాంసపు ముక్కలు రావడం పరిపాటిగా మారింది. వందలు వెచ్చించి తింటున్న ఆహారంలో నాణ్యత ఉండడం లేదు. బేకరీల్లో పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. పాచిపోయిన, మిగిలిన ఐటమ్స్ వేడిచేసి కస్టమర్లకు అందిస్తున్నారు. యువత ఇష్టంగా తినే కేకులు, బర్గర్లు, పిజ్జాలు, పఫ్‌లు ఏ రోజుకారోజు ఫ్రెష్‌గా తయారు చేసి విక్రయించాల్సి ఉండగా.. మిగిలిపోయిన వాటిని మరుసటి రోజు అమ్మేస్తున్నారు. ఇలా ఎక్కువగా కర్రీ, ఎగ్ పఫ్‌లు విక్రయిస్తున్నారు. ఆహార కల్తీ నియంత్రణ అధికారులు తరచూ తనిఖీలు చేపడితే.. ఇలాంటి ఘటనలు జరగవు. కానీ వారు కనీసం అటువైపు చూడకపోవడం, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో బేకరీ, హోటళ్ల నిర్వాహకులకు ఆడిందే ఆట, పాడిందే పాటగా తయారైంది.

**బేకరీలు బేకార్..**

చూడడానికి బేకరీలు అద్భుతంగా కనిపిస్తున్నా.. వాటి తయారీ కేంద్రాలు మాత్రం కంపుకొడుతున్నాయి. బల్దియా అధికారులు, ఆహార కల్తీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో బేకరీల నిర్వాహకుల ఆగడాలకు అడ్డుకట్ట పడడం లేదు. ఇప్పటివరకు ఫుడ్ సేఫ్టీ అధికారులు జరిపిన దాడుల్లో ఎక్కువగా హోటళ్లు, రెస్టారెంట్లే ఉన్నాయి. తిరుబండారాల దుఖాణాలు, బేకరీలు, స్వీట్ హోముల్లో తనిఖీలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. మిఠాయిలకు గడువు తేదీ ఉండడం లేదు. నిజామాబాద్‌లోని పులాంగ్ దారిలో ఉన్న ఓ స్వీట్ దుకాణంలోని మిఠాయిలో బొద్దింక బయటపడడం గమనార్హం. ఈ విషయంలో బీజేపీ ప్రజాప్రతినిధి ఒకరు జోక్యం చేసుకొని వివాదం సద్దుమణిగేలా చేశారని సమాచారం. ఫిర్యాదు చేయని, ఠాణాకు చేరని ఘటనలో నిత్యం జరుగుతూనే ఉన్నాయి. బేకరీల్లో సాస్ డబ్బాలను శుభ్రం చేయడం లేదు. కాలం చెల్లిన సాస్‌ను అందిస్తున్నారు. అపరిశుభ్ర పదార్థాలను సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తేనే.. హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల నిర్వాహకుల్లో మార్పు వస్తుందని ప్రజలు అంటున్నారు.

# పోలీసు సేవల ఫీడ్‌బ్యాక్ కోసం 'క్యూఆర్ కోడ్'

- ఫిర్యాదుదారులు, ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణ
- నేటి నుంచి అమలులోకి..
- ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధూశర్మ వెల్లడి



వినాయక్‌నగర్, జనవరి 8 : పోలీసుల పనితీరును తెలుసుకునేందుకు, వారిపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకునేందుకు పోలీసు అధికారులు కొత్త కార్యాచరణ ప్రారంభించారు. బాధితులు సమస్యలు విన్నవించేందుకు పోలీస్‌స్టేషన్లకు వెళ్లిన అనంతరం పోలీసు సిబ్బంది వ్యవహరించిన తీరు, సిబ్బందిపై ప్రజలకు ఉన్న అభిప్రాయాలను సేకరించేందుకు క్యూఆర్‌కోడ్ పద్ధతిని నేటి (గురువారం) నుంచి ప్రవేశపెట్టనున్నట్లు ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానంతో ఫిర్యాదుదారులు, ప్రజలు తమ అభిప్రాయాలను నేరుగా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నేడు ఈ క్యూఆర్ కోడ్ పద్ధతిని రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ పోస్టర్లను జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని, ప్రజలు పోలీసుల పనితీరుపై ఫీడ్‌బ్యాక్ అందించాలని సూచించారు.

# పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి దుర్మరణం

భిక్కనూరు, జనవరి 8: పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి ఓ రైతు విద్యుత్ షాక్ తగిలి దుర్మరణం చెందాడు. భిక్కనూరు మండలం తిప్పాపూర్ గ్రామంలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు కథనం ప్రకారం.. తిప్పాపూర్ గ్రామానికి చెందిన రైతు మల్లారెడ్డి (61) బుధవారం ఉదయం తన పొలానికి వెళ్లాడు. మోటర్ ఆన్ చేసే క్రమంలో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. స్టార్టర్ డబ్బాలో ఉన్న వైర్లను ఎలుకలు కట్ చేయడంతో అవి తగిలి మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


మల్లారెడ్డి(ఫైల్)

# ఇసుక దందా మళ్లీ షురూ

- అర్ధరాత్రిలో అక్రమంగా తవ్వకాలు
- యథేచ్ఛగా వందల ట్రిప్పుల తరలింపు

కప్పలవాగును 'చేత'బట్టిన కొందరు నేతలు


గోన్‌గొప్పులలో వెలిసిన ఇసుక డంప్

*ఇసుక అక్రమ తవ్వకాలకు బాల్కొండ నియోజకవర్గం అడ్డాగా మారింది. కొన్నాళ్లుగా నిలిచిపోయిన ఇసుక దందా మళ్లీ మొదలైంది. బుధవారం గోన్‌గొప్పుల ప్రభుత్వ పాఠశాల వెనుక ఉన్న ఖాళీ స్థలంలో వందకు పైగా ట్రాక్టర్ల ఇసుక డంప్‌లు ప్రత్యక్షం కావడం గమనార్హం. అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే ఈ డంప్‌లు వెలిసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై రెవెన్యూ, మైనింగ్ అధికారులకు, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అలాగే, పోలీసులకు కాల్ చేసినా స్పందన లేదని గ్రామస్తులు చెబుతున్నారు.*

*– భీమ్‌గల్, జనవరి 8*

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుక దందాకు అడ్డే లేకుండా పోయింది. కప్పల వాగును ఆదాయ వనరుగా మార్చుకున్న అధికార పార్టీ నేతలు ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నారు. అర్ధరాత్రి వేళ వందల కొద్దీ ట్రిప్పుల్లో ఇసుకను తరలించి డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి ఇతర ప్రాంతాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదేశాలతో కొనసాగుతున్న ఈ దందాను అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం ఎక్కడా అడ్డు చెప్పడం లేదు. ఇసుక అక్రమ రవాణాకు కొందరు అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇసుక దందాపై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలతో కొద్ది రోజులు గా తవ్వకాలు నిలిచి పోయాయి. మళ్లీ ఏమైందో ఏమో కానీ రెండ్రోజుల నుంచి కప్పలవాగులో తవ్వకాలు మొదలయ్యాయి. బుధవారం గోన్‌గొప్పులలోని ప్రభుత్వ పాఠశాల వెనుక ఉన్న ఖాళీ స్థలంలో వందకు పైగా ట్రిప్పుల ఇసుక డంప్ ప్రత్యక్షమైంది.

**సర్కారు ఆదాయానికి గండి**

అధికార పార్టీ నేతల ఆగడాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నది. గతంలో ఇండ్ల నిర్మాణాలకు ఇసుక కావాలంటే ప్రభుత్వానికి చలానాలు కట్టే వారు. ప్రభుత్వ అనుమతి ఉన్న క్వారీల నుంచి ఇండ్ల యజమానులకు ఇసుక తరలించే వారు. అయితే, కాంగ్రెస్ గద్దెనెక్కాక అక్రమ దందా మొదలైంది. అర్ధరాత్రిలో ఇసుక తవ్వకాలు చేపట్టి, ఒకచోట డంప్ చేస్తున్నారు. ఇండ్లు నిర్మించుకునే వారికి అవసరమైన ఇసుకను విక్రయిస్తూ సర్కారు ఆదాయానికి గండి కొడుతూ తమ జేబులు నింపుకుకొంటున్నారు.

**చర్యలు తీసుకుంటాం..**

అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టకూడదు. ఎవరైనా అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమ తవ్వకాలపై సమాచారం ఇవ్వాలి. అధికారులు ఎవరైనా సహకరిస్తున్నట్లు తేలితే వారిపై శాఖాపరమైన చర్యలుంటాయి.

**- షబ్బీర్, భీమ్‌గల్ తహసీల్దార్**

**ఫిర్యాదు చేస్తే..**

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు తేలితే సంబంధిత శాఖ వారికి ఫిర్యాదు చేస్తాం.

**- మహేశ్, ఎస్సై**


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

# హామీలు అమలు చేయాల్సిందే



చందూరులో ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నందిపేట్/మాక్లూర్/చందూర్, జనవరి 8: కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ శ్రేణులు చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. బుధవారం కూడా నందిపేట్, మాక్లూర్, చందూర్ తదితర మండలాల్లో పార్టీ నేతలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఆరు గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేయాలని జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ నేతలతో కలిసి మాక్లూర్, నందిపేట్ మండలాల తహసీల్దార్లకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం విఠల్‌రావు మాట్లాడుతూ.. రైతులందరికీ రుణమాఫీ చేయలేదని, రైతుబంధును ఎగ్గొట్టిందని విమర్శించారు. అన్ని పంటలకు ఇస్తామన్న రూ.500 బోనస్ ఇవ్వలేదని, మహాలక్ష్మి పథకం ఊసే లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. రైతులను నిలువునా దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులపై రేవంత్ సర్కారు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నదని మండిపడ్డారు. ఎన్ని కేసులు పెట్టినా వెనుకడుగు వేసేది లేదని, ప్రభుత్వం హామీలను అమలు చేసే దాకా పోరాటం చేస్తామని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ నేతలు రమణారావు, మచ్చర్ల సాగర్, అంజయ్య, భరత్, శ్రీనివాస్, అశోక్‌రావు, మల్లారెడ్డి, శ్యామ్‌రావు, రఘురావు, తిరుమల నర్సాగౌడ్, దర్గాల సాయిలు, అంజయ్య, తాజుద్దీన్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

**చందూర్‌లో..**

ఎన్నికల ముందర కాంగ్రెస్ చెప్పినట్లు రైతుభరోసా కింద రూ.15 వేలు ఇవ్వాలని, సంపూర్ణ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ చందూర్‌లో బీఆర్‌ఎస్ నేతలు ఆందోళన నిర్వహించారు. రైతు బాగుండాలంటే కేసీఆర్ రావాలని నినాదాలు చేశారు. కాంగ్రెస్ పాలనలో కాలయాపన తప్ప రైతులకు, ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. బీఆర్‌ఎస్ నేత మాధవరెడ్డి, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం నిరసన

రెంజల్, జనవరి 7: తాగునీరు లేక నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రెంజల్ మండలం కందకుర్తి గ్రామంలో స్థానికులు బుధవారం ఆందోళనకు దిగారు. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు తాగునీటి సమస్యను పరిష్కరించడం లేదని ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. మొదటి, రెండో వార్డుల్లో నీటి కొరత తీవ్రంగా ఉందని వాపోయారు. చలికాలంలోనే నీళ్ల కోసం అష్టకష్టాలు పడుతున్నామని, ఇప్పుడే ఇలా ఉంటే ఇక ఎండాకాలంలో ఎలా ఉంటుందో అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకాధికారుల పాలన అంటే ఏమో అనుకున్నామని, ఇంత పాడు పాలన ఎప్పుడూ చూడలేదని ఎద్దేవా చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.


కందకుర్తిలో ఖాళీబిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

# వేతన బకాయిలు చెల్లించండి

## ఎన్‌ఎస్‌ఎఫ్ కోర్ కమిటీ అధికారికి మొర

బోధన్, జనవరి 8: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించి, వేతన బకాయిలు చెల్లించాలని ఎన్డీఎస్ఎల్ కార్మికులు ఎన్‌ఎస్‌ఎఫ్ కోర్ కమిటీ అధికారి రమేశ్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్‌లోని ఎన్‌ఎస్‌ఎఫ్ భవన్‌లో ఆయనను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఫ్యాక్టరీని అర్ధాంతరంగా లేఆఫ్ ప్రకటించిన యాజమాన్యం తమకు తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ కార్మికులకు రావాల్సిన వేతనాలతో పాటు అన్ని రకాల బకాయిలను మానవతా దృక్పథంతో చెల్లించాలని, ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కార్మికులు రమేశ్‌బాబుకు విన్నవించారు. మజ్దూర్‌సభ యూనియన్ జనరల్ సెక్రెటరీ పి.ఉపేంధర్, ఐఎన్‌టీయూసీ మెదక్ ప్రధాన కార్యదర్శి సిద్ది రాములు, మెట్‌పల్లి యూనిట్ కార్యదర్శి ప్రమోద్, పలువురు కార్మికులు ఉన్నారు.


ఎన్‌ఎస్‌ఎఫ్ కోర్ కమిటీ అధికారి రమేశ్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు